# విషయసూచిక


**1వ అధ్యాయము - మీ చేతులను బలపరచుడి** 1

(1) నాయకుని సిద్ధపాటు

(2) విశ్వాసముంచి విధేయులగుట

(3) ప్రార్థనా జీవితము

**2వ అధ్యాయము - కలిసి పోరాడుడి** 5

(1) పరిస్థితులను పరిశీలించుట

(2) పరిస్థితులను ఎదుర్కొనుట

(3) పరిస్థితులను జయించుట

1. ప్రభువు నుండి శక్తి పొందుట
2. పనిచేయుట కొరకై ఇష్టపడుట
3. పనిని పంచుకొనుటలో సంతోషము
4. ప్రార్థన ద్వారా శత్రువులను తరుముట
5. చెత్తను తొలగించుట

**3వ అధ్యాయము - దేవుడు పనిని వర్థిల్ల జేయును** 25

(1) లేమిలో కలిమి

(2) పరీక్షలలో విజయము

(3) ప్రార్థన - బలమైన ఆయుధము

ముగింపు

# ఉపోద్ఘాతము

70 సం॥లు చెరలో నుండిన ఇశ్రాయేలు ప్రజలు బబులోను రాజైన కోరెషు పరిపాలనలో యెరూషలేమునకు తిరిగివచ్చిరి. (2 దిన. 36:22,23: ఎజ్రా 1:1-11) వారు వచ్చినప్పటికి యెరూషలేము పట్టణము, దాని ద్వారములు కాల్చివేయబడి యుండెను. ప్రాకారములు పడిపోయి ఉండెను. యెరూషలేము యొక్క స్థితిని కొందరు యూదులు నెహెమ్యాకు తెలియచేసిరి (నెహె. 1:2,3). యెరూషలేము పట్టణమునకు జరిగిన విషయమును, దేవుని ప్రజల యొక్క స్థితిగతులను గూర్చి నెహెమ్యా వినినప్పుడు అతడు చింతాక్రాంతుడై ఉపవాసంతో, కన్నీటితో దేవునికి మొర్ర పెట్టసాగెను. ఇశ్రాయేలు ప్రజలకు దేవుడు చేసిన వాగ్దానములను అతడు దేవునికి జ్ఞాపకము చేయుచుండెను (లేవీకా. 40:45) మొట్టమొదటిగా అతడు తన పాపములను ప్రభువు యొద్ద ఒప్పుకొని, తన తండ్రి ఇంటి వారి పాపములను, దేవుని ప్రజల పాపములను ఒప్పుకొనెను.

ఆ దినములలో ఇశ్రాయేలీయులు స్థితి ఎట్లుండెనో, ఈనాడు దేవుని ప్రజల పరిస్థితియు అట్లే యున్నది. దేవునికి, ఆయన వాక్యంనకు, ఆయన ఇంటికి ప్రజలు ఇవ్వవలసిన స్థానంను ఇవ్వలేదు కనుకనే ప్రజల జీవితంలు నిష్ఫలంగా ఉన్నవి (1కొరి. 3:1-6). మనలను మనం తగ్గించుకొని, నిజమైన పశ్చాత్తాపంతో దేవుని వైపు తిరిగి మన పాపములను ఒప్పుకొనినప్పడే ప్రభువు మనలను క్షమించి, మన ప్రార్థనలను విని మనలను ఆశీర్వదించును. 2 దిన. 7:14లో దేవుడిచ్చిన వాగ్దానము నందు నెహెమ్యా విశ్వాసముంచి, ఉపవాసముతో మోకాళ్ళుచు ప్రార్థించెను. ఇదే నియమము విశ్వాసులకును అన్వయించును. తమ్మును తాము తగ్గించుకొని పాపములను ఒప్పుకొని నప్పడే. ప్రభువు కొరకైన మొదటి ప్రేమను పొందెదరు. అప్పడే ప్రభువు వారిలో తన కార్యమును జరిగించి. వారిమీద ప్రార్థన, విజ్ఞాపన ఆత్మను కుమ్మరించును. (నెహె. 1:5-8). ఈ విధముగా ప్రారంభంలో మనము పొందిన దేవుని ఆశీర్వాదములను తిరిగి అనుభవించెదము.

# 1వ అధ్యాయము

# మీ చేతులను బలపరచుడి

## 1. నాయకుని సిద్ధపాటు

మొట్టమొదట దేవుడు తన కార్యమును నెహెమ్యాలో ప్రారంభించెను. ఆయన ద్వారా అనేకులు దేవుని పనికొరకై ప్రేరేపింపబడిరి. దేవుని ప్రజల యొక్క చరిత్రను మనము గమనించి నట్లయినచో మరల, మరల దేవుడు తన పనిని ప్రారంభించుటకు ఒక నమ్మకమైన సేవకునినో లేక తన ప్రజలలోని శేషమునో వాడుకొనినట్లు చూచెదము. నమ్మకస్థులైన కొద్దిమంది ద్వారానే దేవుడు తన గొప్ప కార్యములను జరిపించి యున్నాడు. మనలో ప్రతి ఒక్కరమును నమ్మకమైన వారముగాను, విజ్ఞాపన చేయువారముగా నుండి దైవసంకల్పమును, ఏర్పాటును నెరవేర్చువారముగాను యుంతవలెనని ప్రభువు కోరుచున్నాడు.

యెరూషలేము పట్టణము పాడైపోయి, దాని గుమ్మములు కాల్చివేయబడి వున్నందున నెహెమ్యా చింతించుచుండెను. (నెహెమ్యా 2:3). అదేరీతిగా దేవుని పని విషయమై శ్రద్ధ కలిగినవారు, దేవుని ప్రజలు ఆత్మీయముగా బలహీనులుగాను, వ్యాధిగ్రస్తులుగాను వుండినప్పుడు చింతించక మానరు. ప్రపంచములో అనేక ప్రాంతములలోని దేవుని ప్రజల స్థితి ప్రస్తుతము ఇట్లే వున్నది ఆత్మీయముగా బలహీనులై ఒంగిపోయి వున్నారు. ఎక్కడ చూచినను ప్రజలు ఆత్మీయంగా శిశువులగానే వున్నారు. దేవుని వాగ్దానముల ప్రకారము ఆయన శక్తి మనకెల్లప్పుడు లభించును. దేవుని ప్రజల స్థితిని గూర్చి మనము చింతించి, ఆయన కోరినట్లు చేయుటకు ఇష్టపడినట్లయినచో మన జీవితములు ఫలవంతముగా వుండగలవు

(యోహాను 14:12; ప్రకటన 1:18). నిన్న, యుగయుగముల వరకు ఏకరీతిగా వున్న సజీవుడైన రక్షకుడు మనకున్నాడు (హెబ్రీ 13:8). దేవుని వాక్యమునకు పూర్తిగా లోబడుటలో మనము తప్పిపోయినప్పుడే మన జీవితములు నిష్ఫలమగును. కేవలము పతనము, ఓటమియే మన జీవితములలో ఎదుర్కొనెదము. అంతేకాక, ఆత్మీయముగా శిశువులము గానే వుందుము.

ఇశ్రాయేలు ప్రజలు బబులోనులో చెరలో వున్నప్పుడు తిరిగి యెరూషలేముకు రాగలమను నిరీక్షణ వారిలో యెంత మాత్రము లేకుండెను. ఎందుకనగా వారు చెరపట్టబడినవారు. సంఖ్యలో కూడా బహుకొద్దిమందియే. అయితే దేవుడు తన ప్రవక్త యైన యిర్మీయాతో చేసిన వాగ్దానంను నెరవేర్చెను. అయితే యెరూషలేమునకు తిరిగి వచ్చెడి అవకాశం అన్యుడైన కోరేషు ద్వారా ఏర్పడెను (2 దిన. 36:22). కోరేషు రాజు ప్రకటించిన పిమ్మటనే వారు యెరూషలేమునకు తిరిగి వచ్చుటకు మొదలుపెట్టిరి. వారి పక్షంగా దేవుడు చేసిన ప్రవచనము నెరవేర్చబడిన విషయమును వారే చూడగలిగిరి. అసాధ్యములైనవి సాధ్యములయ్యెను.

## 2. విశ్వాసముంచి విధేయులగుట

ఇశ్రాయేలీయులలో ఎవరైనను యెరూషలేమునకు తిరిగి రావచ్చునని రాజైన కోరేషు బహిరంగంగా ప్రకటించినప్పటికిని కొందరు యూదులు బబులోనులోనే నిలిచిపోయిరి. ఎందుకనగా వారు ఆ విషయమును నమ్మలేకపోయిరి. వారివలెనే మనము కూడ దేవుని వాగ్దానముల యందు విశ్వాసముంచి, వాటిని నమ్ముటలో తప్పిపోయెదము. గనుకనే ప్రభువు మనలను వాడుకొనలేదు. మనద్వారా కార్యములను జరిపించలేదు. విశ్వాసపూర్వకంగా ఆయన వాగ్దానముల యందు స్థిరమైన నమ్మకముంచవలెను. మన అక్కరలు, సమస్యలు

తీర్చబడునట్లుగా ఆయన వాగ్దానములను నమ్ముకొనవలెను. బైబిలునందు విశ్వాసముంచుచున్నామని చెప్పువారు అనేకులు కలరు. గాని బైబిలు చెప్పుచున్న దానిని నమ్మరు. మానవ ఆచారములు, పద్ధతులు, అలవాటుల యందే వారు నమ్మకముంచెదరు. ఒకవైపు దేవునిని నమ్ముకొనుచున్నామనెదరు. మరొకవైపు, డబ్బు అక్కరగా వున్నప్పుడు అనేకులను అడిగెదరు. కొందరు స్వస్థత దండయాత్రలు చేయుదురు. దేవుడు రోగులను స్వస్థపరచగలడని రోగుల పక్షముగా దేవుని యందు విశ్వాసముంచెదరు. అయితే డబ్బు కావలసినప్పుడు మానవ సహాయం నార్జించెదరు. స్వస్థ పరచిన దేవుడు వారి అక్కరలన్నింటికై డబ్బు ఇవ్వలేడా? వారు దేవుని వాక్యమును సంపూర్ణంగా అనుసరించుటలో తప్పిపోవుచున్నారు. దేవునికిని, ఆయన వాక్యమునకును పూర్తిగా లోబడునప్పుడే దేవుడు మన పక్షముగా కార్యము చేయును. యోహాను 15:7 ప్రకారము మనము ప్రభువైన యేసుక్రీస్తు నందు నిలిచి వుండవలెను. మనము ఆయన ప్రభుత్వము క్రింద వున్నప్పుడే ఆయనలో నిలిచి వుండగలము. ప్రతి చిన్నదానిలో ఆయనకు లోబడి, ఆయన ద్వారా పరిపాలింప బడవలెను. మన జీవితములోని ప్రతి అడుగులో ఆయనద్వారా నడిపింప బడవలెను. అన్ని విషయములలో ఆయనకు విధేయులము కావలెను. అప్పుడే మీ కేది యిష్టమో అడుగుడి, అది మీకు అనుగ్రహింపబడును అను వాగ్దానం మనలో నెరవేరును. అట్లు నెహెమ్యా విశ్వాసముంచి విధేయుడయ్యెను. కనుకనే దేవుడు తన పక్షముగా కార్యము చేయుటకు ప్రారంభించెను.

## 3. ప్రార్థనా జీవితము

అనేకులు ప్రభువైన యేసుక్రీస్తునందు విశ్వాసముంచి వున్నామని చెప్పెదరు. కాని కష్టములు రాగానే ఏడ్చుటకు మొదలు పెట్టెదరు. ఎంతో యుక్తిగా, వారి ఆర్థిక అక్కరలను ఇతరులను

తెలియచేసెదరు. కొన్నిసార్లు బిగ్గరగా ప్రార్థించి వారి అక్కరలను వెలిబుచ్చెదరు. అయితే నెహెమ్యా ఆ రీతిగా ప్రవర్తించినట్లు మనము కనుగొనము. సేవకు లందరికంటెను అతడే ముఖ్యమైనవాడుగా వున్నప్పటికిని, అతని మనవి ఆలకింపబడునదిగా వుండినప్పటికిని అతడు రాజునొద్ద ఎట్టి మనవి చేయలేదు. ఈ లోకరాజుతో తాను మాట్లాడక పూర్వం పరలోక మందున్న దేవునితో మొదట మాట్లాడెను. తన విన్నపము రాజుతో సరియైన రీతిగా చెప్పునట్లు దేవుని యెదుట ప్రార్థించెను. రాజు యెదుట మాట్లాడు ప్రతి మాట కొరకై దేవుని మీదనే ఆధారపడెను. తత్ఫలితంగా, రాజు యెదుట తాను విన్నపము చేయగానే రాజు అతడు దైవజనుడని తెలిసికొనగల్గెను. అతడు పలికిన మాటలు దేవుని మాటలేయని రాజు గ్రహించగల్గెను.

నెహెమ్యా రాజు దగ్గర సెలవు కొరకు మాత్రమే అనుమతి కోరెను. ప్రభుత్వ ఉద్యోగులు ఏ రీతిగా సెలవు కోరుకొందురో అట్లే అతడు కూడా రాజునొద్ద సెలవు కోరెను. (నెహెమ్యా 2:5). ఆ సమయంలో అతని యెదుటనున్న పని కొరకై విస్తారమైన డబ్బు అవసరమై వుండెను. ఆర్థిక సహాయం కొరకై అతడు రాజును సహాయం అడిగి ఉండవచ్చును. రాజుకూడ అతనికి సహాయము చేసియుండెడి వాడు. అయితే దేవుని పని కొరకై నెహెమ్యా రాజు డబ్బు మీద ఆధారపడలేదు. యెరూషలేమునకు వెళ్లుటకు రాజు అతనికి అనుమతి యిచ్చుటయేగాక అతనికి తోడుగా సేనాధిపతులను, గుర్రపు రౌతులను పంపించెను (నెహెమ్యా 2:9) మనము ఏ భారముతోనైనను మోకాళ్ళని ప్రార్థించినప్పుడు ఆయనే మనలను నడిపించును. అంత మాత్రమేకాక మన క్షేమము భద్రత కొరకై అవసరమైన వాటిని యిచ్చును. ఆ రీతిగానే నెహెమ్యా తనకు అవసరమైన వాటిని పొందినవాడై యెరూషలేము చేరెను.

# 2వ అధ్యాయము

# కలిసి పోరాడుడి

## I. పరిస్థితులను పరిశీలించుట

పడిపోయిన ప్రాకారమును కట్టక పూర్వము అతడు ఆ గోడలు ఎట్లు పడిపోయెనో, ఏ రీతిగా గుమ్మములు కాలిపోయెనోనని వాటిని పరిశీలించెను. యెరూషలేమును కట్టక పూర్వము నెహెమ్యా ఏ రీతిగా పట్టణమంతయు పరీక్షించెనో అట్లే మనము కూడా మన నిష్ఫలమైన జీవితమునకు కారణమేమిటో మొదట తెలిసికొనవలెను.

ఈ దినములలో విశ్వాసులు, క్రైస్తవ నాయకులు దేవుని ప్రజలను ఉజ్జీవింప చేయవలయునని, మేల్కొల్పవలయునని ప్రయత్నించి దాని కొరకై ప్రార్థించుచున్నారు కాని నిస్సారమైన జీవితము ఎల కలిగెనో దానిని తెలిసికొనుటకు ప్రయత్నించకున్నారు. "మేము పాపము చేసితిమి" అను నటువంటి వాడుకైన పదములు ప్రార్థనలో ఉచ్చరించెదరు. అట్టి ప్రార్థనల ద్వారా దేవుడు తన ప్రజల మధ్యలో పనిచేయలేడు. కొంచెముసేపు ప్రార్థించి దాని తర్వాత ఆ విషయమును పూర్తిగా మరచిపోయెదరు. అయినను ప్రార్థించితిమి కదాయని ఏదో సంపాదించినట్లు తలంచెదరు. ఒక రోగి డాక్టరు యొద్దకు వెళ్ళి "నేను బాగా లేను" అని చెప్పి వ్యాధి వివరము లేమియు చెప్పకుండిన యెడల అతడెంతగా బాగుపడునో, మనస్థితి కూడా వాడుక రీతిగా ప్రార్థించుట ద్వారా అంతే బాగుపడును. రోగి తన వ్యాధిని గూర్చి డాక్టరుతో విపులముగా చెప్పినప్పుడే, డాక్టరు వ్యాధి ఏదో గ్రహించి సరియైన మందు దాని నివారణకై యివ్వగలడు. యెరూషలేము యొక్క ప్రాకరములు పడిపోయెను. అయితే ఇశ్రాయేలు ప్రజల పాపమును బట్టియే అవి కూలిపోయెను. సత్యమును వారు గ్రహించలేదు. దేవుడు

తన ప్రేమతో అనేక సంవత్సరములు తన ప్రవక్తల ద్వారా వారిని హెచ్చరించుచు వచ్చినప్పటికిని, వారు దేవుని హెచ్చరికల నిర్లక్ష్యపెట్టి దేవునికి ఎడతెగక అవిధేయులైరి. వారికి చాలినంత సమయమిచ్చిన తరువాతనే దేవుడు, బబులోను రాజైన నెబుకద్నెజరును పంపి ఆ పట్టణమును నాశనము చేసెను. ఆ ప్రాకారములను పడగొట్టనిచ్చి, గుమ్మములను కాల్చి వేయించెను.

ఈ దినములలో కూడా విశ్వాసులస్థితి యిట్లే యున్నది. వారి జీవితములు నిష్ఫలమై యున్నవి. ఎందుకనగా మానవాచారములు, పద్ధతులనే వారు అవలంబిచుచు దేవుని వాక్యమునకు లోబడకున్నారు. వారి నిష్ఫలస్థితికి కారణమిదియేనని ఎరుగలేకున్నారు.

బలమైన కట్టడమునకు బలమైన పునాది అవసరము.బండ మీద కట్టిన యిల్లు. గాలి, తుఫాను వరదలకు నిలువబడగలదని ప్రభువే ఆత్మీయ యింటిని గూర్చి పలికెను. ప్రభువైన యేసుక్రీస్తే ఆ బండయై యున్నాడు. గనుక మన కట్టడమును ఆయనమీదనే నిర్మించవలయును. అనగా ఆయన బోధ. ఉపదేశము. చిత్తము, పరలోకపు ఏర్పాటు, శక్తి, జ్ఞానము మీదనే ఆధారపడవలెను. "క్రీస్తు యేసే ముఖ్యమైన మూలరాయియై యుండగా అపొస్తలులును. ప్రవక్తలును వేసిన పునాదిమీద మీరు కట్టబడియున్నారు" అని ఎఫెసీ. 2:20లో చదివెదము. ఆ రీతిగా విశ్వాసులముగా ఆత్మీయముగా బలమైన పునాదిమీద ఆత్మీయ గృహమును కట్టవలసి యున్నాము. అనేకులు ఈ ఆత్మీయ నియమమును మరచిపోయి ఇసుకమీద యిల్లు కట్టుటకు ప్రయత్నించుచున్నారు. అనగా దేవుని యొద్ద నుండి ఎట్టి నిశ్చయతను పొందకయే కట్టుచున్నారు. వారి కట్టడమునకు దేవుని ఆధారము లేదు. కనుక ఇసుక మీదనే కట్టుచున్నారు. అందువలననే ఆ కట్టడము ముక్కచెక్కలగుచున్నది. హెబ్రీ. 12:26లో దేవుడు మనకొక

తీవ్రమైన హెచ్చరికను ఇచ్చుచున్నాడు. మానవులతో చేయబడిన దాని నంతటిని ఆయన కదలింప చేయుచున్నాడు. మానవులచే నిర్మింప బడినశాఖ లన్నింటిని ఆయన కదలింపనై యున్నాడు. గనుకనే మనము ఏమి చేసినప్పటికిని వాక్యము ననుసరించియే చేయవలయును. మన పని వాక్యము మీదనే ఆధారపడి యుండవలెను. అప్పుడే మన పని ఫలవంతముగా యుండి శత్రువు ఎదురింపులన్నింటిలో నిలిచి యుండగలదు.

## 2. పరిస్థితులను ఎదుర్కొనుట

పట్టణము యొక్క విషాదపరిస్థితిని నెహెమ్యా చూచినప్పుడు ఇతరులకు ఆ విషయం తెలియచేసెను (17వ వచనం). పని ప్రారంభించగానే అతనికి తోడ్పడుటకు అనేకులు ముందుకు వచ్చిరి. దేవుని హస్తము అతనికి తోడై యుండెనని కూడా అతడు వారితో చెప్పెను (18వ వచనము) ఈ దినములలో కూడ నెహెమ్యా లాంటి వ్యక్తులు మనకు అవసరము. 'దేవుని హస్తము ఇతనికి తోడుగా నున్నది' అని యితరులు చెప్పగలిగినటువంటి వ్యక్తులు అవసరమైయున్నారు. దేవుని హస్తము నెహెమ్యాకు తోడై యున్నదని ప్రజలు చూడగానే, అనేకులు దేవుని పనిలో అతనికి తోడ్పడిరి. హోరోనీయుడైన సన్బల్లటును, అమ్మోనియుడైన టోబియా అనువాడును, అరబీయుడైన గెషెమును ఆ మాట వినినప్పుడు వారిని హేళన చేసి, వారి పనిని తృణీకరించిరి. మనము దేవుని పనిలో ఏదైనను పాలు తీసికొనునప్పుడు మనము శత్రువుల ద్వారా ఎగతాళి చేయబడి ఎదిరింపబడుట తప్పదు. మనలను అధైర్యపరచుటకును, కలవర పరచుటకును శత్రువు ఉపయోగించు మొదటి ఆయుధము యిదియే. నెహెమ్యా దినములలో ఆ ఈ ముగ్గురు వ్యక్తులు ఆ పట్టణములో పేరుగాంచి, పలుకుబడి

కలిగియుండిరి. దేవుని పనిని ఎదిరించుటకు సన్బల్లట్టు టోబియా లాంటి వ్యక్తులు ప్రతి దేశములో కలరు. మనము చాలినంత సమయము ప్రభువు సన్నిధిలో గడుపక పోయినట్లయినచో అట్టి వ్యక్తులు మనము ప్రభువును వెంబడించకుండునట్లు మనలను ఆటంకపరచుటలో విజయము పొందెదరు, మనము దేవుని పని ప్రారంభించినపుడు, వారు మనలను హేళన చేసెదరు, నిరుత్సాహ పరచెదరు. కేవలము ప్రార్థన ద్వారానే నెహెమ్యా ఈ ఆటంకములన్నింటిని జయించగల్గెను. వారి కేకలను అతడు లక్ష్యము చేయక తన మనస్సును ప్రభువు మీదనే నిలుపుకొనెను. కనుకనే "ఆకాశమందు నివాసియైన దేవుడు తానే మా యత్నమును సఫలము చేయును. గనుక ఆయన దాసులమైన మేము కట్టుటకు పూనుకొనుచున్నాము" అని ధైర్యముతో చెప్పగల్గెను. (20వ వచనం). మనలో ఎవరైతే యింకను తిరిగి జన్మించలేదో వారెంత తెలివిగల వారైనను కేవలము వారు లోక సంబంధమైన మనస్సు గలవారైనందునను, దేవుడు ఆ పనికై వారిని పిలువనందునను, దేవుని పనిలో వారికి ఎంత మాత్రము భాగమే లేదు. చాల మంది దేవునికి విధేయులయ్యెదరు. అయితే ఏ శ్రమయైనను కష్టమైనను రాగానే వారు దేవుని యందు విశ్వాసముంచుటకు బదులు, ధనవంతుల అనుగ్రహమును కోరెదరు. ఏ పరిస్థితులలోనైనను దేవుని ప్రజలు భక్తి హీనులపై, లోకస్థులపై ఆధారపడకూడదు.

ప్రభువు పనికొరకు మనం ధైర్యంగా నిలువబడినప్పుడు శత్రువు మనలను ఎదుర్కొనును. మనలను భయపెట్టి అధైర్య పడునట్లు చేయును. అయితే మనం దేవునికి లోబడుట ద్వారా, ప్రార్థించుట ద్వారా నిశ్చయంగా శత్రువును ఓడించెదము. అట్లు నెహెమ్య ప్రార్థనలో దేవుని మీద ఆధారపడుట ద్వారా శత్రువు ఎదిరింపుల నిల్చువకలిగెను. అంతమాత్రమే కాక శత్రువును కూడా ఓడించెను.

దేవుని వాక్యమునకు లోబడుట ద్వారా నిష్ఫలమైన మన ఆత్మీయ జీవితము బాగు కాగలదని మనము చూచితిమి. యెరూషలేము యొక్క పడిపోయిన గోడలు, కాల్చబడిన గుమ్మములు ప్రపంచములో ఈనాటి దేవుని ప్రజల స్థితిని చూపించుచున్నవి. ఇశ్రాయేలు ప్రజలను హెచ్చరించు నిమిత్తమై దేవుడు తన ప్రవక్తలను పంపెను. అయితే ప్రజలు వారి మాటలు విననొల్లకపోయిరి. దేవునికి విధేయులుగాక, ఎడతెగక ఆయన ఎడల తిరుగుబాటు చేసిరి. కనుకనే, దేవుడు వారిని శిక్షించవలసి వచ్చెను. ఆయన హెచ్చరిక చేసిన రీతిగా బబులోను రాజైన నెబుకద్నెజరు యెరూషలేమును పట్టుకొని ప్రజలందరిని ఖైదీలుగా తీసికొనిపోయెను. యెరూషలేము గోడలు పడగొట్టబడెను. దాని గుమ్మములు కాల్చివేయబడెను. 70 సంవత్సరముల తర్వాత దేవుడు వారిని తిరిగి రప్పించెదనని తన ప్రవక్తలకు తెలియచేసెను. ఆయన వారితో చెప్పినట్లే చేసెను. తరువాత వారు పడిపోయిన గోడలను తిరిగి కట్టి, కాలిపోయిన గుమ్మములను తిరిగి నిలువబెట్టిరి. అట్లు చేయుట ద్వారా, దేవునితో జతపనివారైరి. అదేరీతిగా విశ్వాసులమైన మనము ప్రభువైన యేసుక్రీస్తు ద్వారా దేవునితో సమాధానపరచబడినప్పుడు ఆయనతో జతపని వారగుదుము.

విశ్వాసులమైన మనకు అనేక పేర్లు కలవు. వాటిలో ఒక పేరు "దేవుని తోటి జత పనివారు" (1 కొరింథీ 3:9). ఈ విషయమై 11 కొరింథీ 6:1లో కూడా చెప్పబడినది. "కాగా మేమాయన తోటి పనివారమై మీరుపొందిన దేవుని కృపను వ్యర్థము చేసికొనవద్దని మిమ్మును వేడుకొనుచున్నాము." కావలయునంటే దేవుడు యెరూషలేము గోడలను కట్టుటకు ఇతర ప్రజలను వాడుకొని యుండెడివాడు. లేక కోరేషు రాజునే ఆ పనికై నియమించి యుండెడివాడు లేనట్లయిన అర్తహషస్త రాజు ద్వారా కొద్ది దినములలోనే

ఆ పని ముగించి యుండెడివాడు. అయితే దేవుడు అట్లు చేయలేదు. ఆ అధికృతను బాధ్యతను దేవుడు తన ప్రజలకే ఇవ్వగోరెను. వాస్తవముగా తిరిగి జన్మించినవారు సత్య జీవమును వరముగా పొందినవారు మాత్రమే, దేవుని యింటిని నిర్మించుటలో పాలుపొందగలరు.

ఒక శాఖను స్థాపించుటకు లేక ఒక గుంపును సెలకొల్పుటకు మనము రక్షింపబడలేదు. దేవునికి ఒక నివాస స్థలమును నిర్మించుటకు ఆయనకు ఒక గృహమును కట్టుటకై పిలుపబడి యున్నాము. ఎఫెసీ 2:22 ప్రకారము దేవునికి నివాస స్థలమై యుండుటకు, దేవునికి ఆలయముగా నుండుటకు మనము కూర్చబడియున్నాము. ఈ కట్టడము రాళ్ళు, ఇసుక, మట్టి, కర్రతో కట్టబడినది కాదు. ఇది ఆత్మీయమైన నిత్య నివాస స్థలము. ఈ గృహమును నిర్మించెడి అధికృత, ఘనత ఎన్నటెన్నటికిని లోకస్థులకు చెందనే చెందదు. దేవదూతలకు సహితము ఈ అధికృత ఇవ్వబడలేదు. కేవలము ప్రభువైన యేసుక్రీస్తు ద్వారా విమోచింపబడినవారే ఈ అధికృతను కలిగియుందురు.

## 3వ అధ్యాయము

## పరిస్థితులను జయించుట

### I. ప్రభువు నుండి శక్తి పొందుట

యెరూషలేముకు నెహెమ్యా వచ్చినప్పుడు దాని గోడలు పడిపోయి గుమ్మములు కాల్చబడి యుండెను. ఆ పరిస్థితిని అతడు చూచి, యితరులకు కూడ తెలియచేసి తిరిగి వాటిని కట్టుటకు పూనుకొనెను. దేవుడే అతనిని అక్కడకు పంపించెననియు, ఆ పనిని చేయుటకై దేవుడే ద్వారమును తెరచెననియు అతడు ఎరిగి యుండెను. తప్పకుండా దేవుడతనికి సహాయము చేయునని అతడు విశ్వసించెను. ఎటువంటి సందేహములు లేకుండ, అతడు పనికి పూనుకొనెను. ఆ

పని కష్టతరమైనదైనను అతడు దానిని చేయుటకు పూనుకొన్నవాడై పని అంతటిని ప్రజలకు పంచిపెట్టెను. యెరూషలేము గోడలు ఎత్తయినవి, దళసరివి కూడ. కనుక అనుభవశాలులు, శిక్షణ పొందిన వారే ఈ పనికి అవసరముగా యుండిరి. ఆ గోడలు పూర్తిగా పడిపోయి యుండెను. వాటిని తిరిగి నిర్మించుట చాలా కష్టముతో కూడిన పనిగా యుండెను. అట్లే ఈనాటి ప్రజల నిర్జీవ, నిష్ఫలిత స్థితిని చూచినప్పుడు వారిని బాగుచేయుట అసాధ్యముగా కనిపించును. కనుకనే అనేకులు అధైర్యపడి, "ఈ ప్రజల పరిస్థితిని గూర్చి చింతించి ఏమి లాభము లేదు. ఎట్లయినను మనము అపొస్తలుల కాలములో నివసించుట లేదు కదా!" అని చెప్పెదరు. మరికొందరైతే సమయానుకూలముగా జీవించవలెనని తలంచెదరు. అటువంటి వ్యక్తులను గూర్చి దేవుడు ఏ మాత్రమును సంతోషించడు. నీవు ఆయనకు లోబడి, ఆయనను వెంబడించుటకు యిష్టపడినట్లయినచో ఆయన నీకు అవసరమైన కృపను, శక్తిని అనుగ్రహించును. మనము ఆయనకు లోబడి, ఆయననునమ్మినట్లయినచో మన పొరపాటులు. కొరతలు ఎన్ని ఉన్నప్పటికిని దేవుడు మనలను వాడుకొనును.

## 2. పనిచేయుట కొరకై యిష్టపడుట

దైవక్రమము ప్రకారము నెహెమ్యా గోడను వివిధ భాగములుగా విభజించెను. గోడలో ఏదో ఒక భాగము లేక ఒక మూల నాకు కావలయునని వారి యిష్ట ప్రకారము అడుగలేదు. కొందరు వారి అభిరుచుల ప్రకారము పనులను చేయకోరెదరు. వారు ఆ పనిని తప్ప మరి యితర ఏ పనిన్ని కూడా చేయలేరు. ఉదాహరణముగా, పరిశుద్ధ సమాజ కూడికలలో కొందరు "పాత్రలు మాత్రమే మేము కడుగగలము. వేరే పనులు మేము చేయలేము" అనెదరు. దేవుని సేవకులలో కూడా కొందరు తమకు అనుకూలముగా తమ యిష్టములనే నెరవేర్చుకొనుట

ద్వారా దేవుని క్రమములోనికి, ఏర్పాటు లోనికి రాలేకయున్నారు. ఉదాహరణముగా వారికి పిల్లలున్న యెడల, మంచి స్కూళ్లు, మంచి యిండ్లు దొరకు స్థలములలో యుండగోరెదరు. దేవుడు ఎక్కడకు పంపితే, అక్కడకు వెళ్ళుటకు వారు యిష్టపడరు. వారి భార్యలు ఎక్కడ యుండవలెనని కోరెదరో అక్కడనే యుండెదరు. కొంతమంది భార్యలు చాలా సులువుగా భర్తల మనస్సును మార్చగలరు. ఒక భార్యతో, "భర్త యింటికి శిరస్సు కదా" అని ఒకరు చెప్పిరి. అందుకామె "అవును భర్త శిరస్సేయని నమ్మెదను. అయితే నేను మెడగా నున్నాను. ఆ తలను త్రిప్పెదను" అనెను. ఈ తలంపు సరియైనది కాదు. వాక్యానుసారమైనది కాదు. నెహెమ్యా పని నంతటిని సమానముగా విభజించెను. చిన్న, పెద్ద, గొప్ప, పేద అను భేదము లేకుండా పని అంతటిని సమానముగా పంచి యిచ్చెను. కేవలము దేవుని నడుపుదల ప్రకారమే పనిని విభజించెను. కాని వేరే యోగ్యత లేవి చూడలేదు. దేవుని ఏర్పాటు దైవక్రమము ఎప్పటికిని శ్రేష్ఠమైనవి. వేరే యోగ్యతలపై మనము లక్ష్యముంచకూడదు. ఒకవేళ ఏమైన కష్టములున్నయెడల, వాటిని జయించుటకు ప్రభువే శక్తినిచ్చును. ఆటంకములన్నింటిని ఆయనే తొలగించును. అసాధ్యములైనవి ఏమైనయున్న యెడల ఆయనే వాటిని సాధ్యములుగా చేయును. అక్కరలు ఏమైనా యున్నయెడల ఆయనే వాటిని తీర్చును. ప్రజలందరు హృదయపూర్వకముగా ఈ పనిలో పాలుపొంది, గోడలను నిర్మించుటలో వారికివ్వబడిన పనిని నెరవేర్చిరి. సంతోషముతోను, నమ్మకముగాను పని జరిగించిరి. ఏ ఒక్కరును సణగలేదు. "నేను ఈ పనిని చేయలేను" అనలేదు. వారికివ్వబడిన పనిని సంపూర్ణముగా నెరవేర్చిరి.

విశ్వాసియొక్క జీవితములోని రహస్యము యిదే "మీరేమి చేసినను మనుష్యుల నిమిత్తముగాక, ప్రభువు నిమిత్తమని మన స్ఫూర్తిగా

చేయుడి" (కొలొస్సె 3:23) ప్రభువైన యేసుక్రీస్తు యొక్క విశ్వాసులముగా మనకు యింటిలోనైనను, వెలుపలనైనను మనకివ్వబడిన పనిని హృదయపూర్వకముగా చేయుటలో తప్పిపోకూడదు.

ఒక ఆసుపత్రిలో ప్రభువు నందు విశ్వాసముంచిన నర్సు ఉండెను. ఆమె తన పనిని నమ్మకముగా చేయుచుండెను. కొంతకాలమైన పిమ్మట ఆమెను వేరే వార్డునకు మార్చిరి. అక్కడ కూడా ఆమె ఎప్పటిలాగే తన పనులను నమ్మకముగా హృదయపూర్వకముగా చేయుచుండెను. ఆ వార్డునంతను శుభ్రముగా నుంచెను, చేయవలసిన పనులన్నింటిని ఆమె త్వరితముగా ముగించెను. వార్డు అంతయు ఎంతో పరిశుభ్రముగా నుండెను, దీనిని గమనించిన ఒక రోగి "ఈ రోజు వార్డును చూచుటకు ఎవరు వచ్చుచున్నారు?" అని అడిగెను. అందుకామె "ఎవరును రారు" అని బదులు చెప్పెను. అందుకతడు "మరి మీరేల అంత కష్టపడి పనిచేయుచున్నారు? మీకంటె ముందుగా పనిచేయుచుండిన నర్సులు ఈ రీతిగా కష్టపడి, ఇంత నమ్మకముగా ఎవరును పనిచేయలేదే?" అని అడిగెను. అందుకా నర్సు "నేను మనుష్యుల నెవ్వరిని సంతోషపరచుటకు ఇట్లు చేయలేదు. నేను నా రక్షకుడు, ప్రభువైన యేసుక్రీస్తునే సంతోషపరచగోరుచున్నాను" అని సమాధానమిచ్చెను. కొందరు స్కూలు టీచర్లయితే ఇన్స్పెక్షన్ కొరకై కష్టపడెదరు. లేకపోయినట్లయితే వారి రికార్డులు వ్రాయుటలో చాలా అశ్రద్ధగా యుండెదరు.

ప్రభువు మనకప్పగించిన ఏ పనినైనను ఇష్టపూర్వకంగా చేయవలెను. 1932వ సంవత్సరములో దేవుని సేవకైనన్ను నేను అప్పగించుకొనినప్పుడు, నేను ఏ పనినైనను చేసెదననియు, ఎట్టి ఆహారమునైనను భుజించెదననియు, ఎక్కడకు పంపినను వెళ్లెదననియు, పట్టణములో అయినను పల్లెలో అయినను యుండెదననియు, ఎట్టి

కఠిన ప్రాంతమునకు పంపినను వెళ్లెదననియు ప్రభువుతో వాగ్దానము చేసితిని. ఆయన నన్ను ఒంటరిగా వదలివేయడని నేనెరుగుదును. నాకు ఆయన చాలిన వాడని విశ్వసించితిని. ఆయన మనకు ముందుగా పోవును. మనవెనుక వచ్చును. మన పనికి అవసరమైన శక్తిని, బలమును అనుగ్రహించును. దేవుని పరిపూర్ణమైన ఏర్పాటులో, చిత్తములో యున్నచో ఏ పనినైనను ముగించుటకు మన పక్షముగా ఆయనే కార్యము చేయును.

యెరూషలేము యొక్క గోడలను తిరిగి నిర్మించునప్పుడు కొందరు వడ్రంగి వారుగా, మేస్త్రీలుగా పనిచేసిరి. ఆ పని కొరకై వారు శిక్షణ పొందక పోయినప్పటికిని దానిని దేవుని యొద్దనుండి అంగీకరించిరి. తత్ఫలితముగా ఆ పనికొరకై కావలసిన జ్ఞానమును, నిపుణతను దేవుడనుగ్రహించెను. మరి కొందరయితే హృదయ పూర్వకముగా పని చేయకపోయిరి. దానిని నెహెమ్యా 3:5లో చూచెదము. జనుల అధికారులు పనిచేయుటకు నిరాకరించలేదు కాని ఇష్టపూర్వకముగా పనిచేయలేదు. పరిశుద్ధ సమాజ కూడికల సమయములో ఆయా పనుల కొరకై వాలంటీర్లు కావలయునని అడిగినప్పుడు అనేకులు ముందుకు వచ్చెదరు. అయితే కొద్దిరోజులు మాత్రమే సంతోషముగా పనిచేసెదరు. క్రమేణ పనిలో ఆసక్తిని కోల్పోయి దేవుని యింటిలో వారికి అప్పగించిన పనిని చేయుటలో తప్పిపోవుట ద్వారా పనిలో సంపూర్ణ భాగము పొందలేకున్నారు.

## 3. పనిని పంచుకొనుటలో సంతోషము

ప్రజల అంతస్థు ఏమైనప్పటికిని చేయుటకు ప్రతి ఒక్కరికీ ఒక ముఖ్యమైన పని యివ్వబడినట్లు నెహెమ్యా మూడవ అధ్యాయములో చూచెదము. యాజకులైనను, అధిపతులయినను,

కంసాలి వారైనను, వారెవరైనప్పటికిని, ప్రతి ఒక్కరికి పని యివ్వబడెను. (8,31,32 వచనములు), హల్లోహెషు కుమారుడయిన షల్లూము సగమునకు అధిపతియైనను, అతడును అతని కుమార్తెలును పనిలో పాలుపొందిరి. (12వ వచనము) ప్రధాన యాజకుడైన ఎల్యాషీబును, అతని సహోదరులును ప్రభువు పనిలో ముందుకు వచ్చి ముఖ్యమైన పనిచేసిరి (1వ వచనము).

ఈ దినములలో దేవుని సేవకులు సహ కష్టమైన పనిని ప్రయాసముతో కూడిన పనిని చేయుటకు ఇష్టపడరు. వారు మిగతా ప్రజలకంటే ప్రత్యేకమైన వారనియు, వారిపట్ల ప్రత్యేక గమనము చూపవలయుననియు కోరెదరు. మనము ఎవరమైనప్పటికిని, ఎట్టి స్థితిగలవారమైనప్పటికిని, దేవుని పనిలో పాలు పొందవలసిన వారము. మనము దేవుని క్రమములో నుండి ఆయనను క్రమములోనే యుండవలయును. ఆయన ఏర్పాటులో యుండుట ఆయన ఆజ్ఞను నెరవేర్చుట అనునదియే మన జీవితమునకు గురిగా యుండవలెను. ప్రజలు నెహెమ్యా లోబడక యుండినట్లయినచో యెరూషలేము గోడలు కట్టబడి యుండెడివికావు. వారు నాయకునికి లోబడినందు వలననే శత్రువు ఎదిరించినప్పటికిని పనిని ముగించగలిగిరి. మమ్మును ఈ పనికి మినహాయించవలెనని లేక వేరే రకమైన మనవులను, ప్రత్యేక విన్నపములను నెహెమ్యా దగ్గరకు ప్రజలు తీసుకొని రాలేదు. కనుకనే ఈ పని సాధ్యమయ్యెను.

ప్రభువైన యేసుక్రీస్తు మన పరలోకపు నెహెమ్యా నూతన యెరూషలేము యొక్క మచ్చు ఆయనే కలిగియున్నాడు..దేవుని జత పనివారముగా ఆయన యింటిలో, ఆయన క్రమము ఏర్పాటులో నుండి ఆయన శిరస్సత్వము క్రింద నుండి, అన్నియు ప్రభువు కొరకు మాత్రము చేసినప్పుడే ప్రపంచములోని పలు ప్రాంతములకు మనలోనుండి ఆయన

జీవము ప్రవహించును. మనము చేయుపనిని, మనము ఎట్లు దానిని చేయుచున్నామో అను విషయమును ప్రభువు వ్రాసియుంచును. దేవుని ఏర్పాటు క్రమము ప్రకారము, దేవుని పనిలో హృదయపూర్వకముగా పాలుపొందు రహస్యమును తెలిసికొనినప్పుడు దేవుడు మనకు కావలసిన జ్ఞానమును, కృపను అధికశక్తిని అద్భుతరీతిగా అనుగ్రహించును. అంతేకాక, మన మధ్యలో ప్రేమ ఆత్మీయ ఐక్యతను అనుభవించెదము. (యోహాను 13:35)

## 4. ప్రార్థన ద్వారా శత్రువులను తరుముట

పడిపోయిన యెరూషలేము గోడలు, కాల్చబడిన గుమ్మములు లోకములోని దేవుని ప్రజల నిష్ఫలిత స్థితిని సూచించుచున్నదని యింతకుముందే చూచితిమి. ఇశ్రాయేలు ప్రజల యొక్క తిరుగుబాటు, పాపమును బట్టియే ఈ స్థితి కలిగెనని కూడా చూచితిమి. ఈ దినములలో కూడా దేవుని ప్రజలు అవిధేయులై పాపములో యున్నందున దేవుని ప్రజలలో నిర్జీవస్థితి కనిపించుచున్నది. అయితే కృపగల దేవుడు శేషమును తన కొరకై యుంచుకొని. తద్వారా తన ప్రజలు తన రక్షణను సంపూర్ణముగా అనుభవించునట్లు చేయును. పడిపోయిన గోడలను కట్టుటకును, కాల్చబడిన గుమ్మములను తిరిగి స్థాపించుటకును దేవుడు నెహెమ్యాను, తన జత పనివారిని వాడుకొనెను. దేవుని విధేయులై, దేవుని ద్వారా వాడబడుటకు యిష్టపడేవారు, ఎట్టి ఎదిరింపునకయినను సరే ఎదుర్కొనుటకును, దానిని జయించుటకును సిద్ధపడి యుండవలెను. నెహెమ్యా తన సహాయకులు ఏ రీతిగా హేళనలు ఎదిరింపులను ఎదుర్కొనిరో అట్లే మనము కూడా అపహాస్యములను, ఎగతాళిని ఎదుర్కొనుటకును. దానిని జయించుటకును సిద్ధపడి యుండవలెను. సన్బల్లటు వారిని బహుగా హేళన చేసి వారికి శ్ర కలుగచేసెను. (4:1). అతనికి తోడ్పడిన టోబియా మరొకడు (4:3)

సన్బలట్టు, టోబియా అను ఈ యిరువురు వ్యక్తులు, ఆ ప్రాంతములో పలుకుబడి కలిగినవారు. దేవుని సేవకులమైన మనము కూడా పలుకుబడి, అధికారము గల వ్యక్తుల నుండియే అనగా క్రైస్తవులని పిలువబడే అధికారులు, నాయకుల నుండియే ఎదిరింపబడెదము.

1941వ సంగరములో మద్రాసు పట్టణములోని క్రైస్తవ మతమునకు చెందిన నానా శాఖలకు చెందిన నాయకుల నుండియే మాకు ఎదిరింపులు వచ్చెను. సన్బల్లట్టు, టోబియా అనువారు వారి హోదాను పలుకుబడిని యెరూషలేము గోడలను తిరిగి నిర్మించుటకై ఉపయోగించి ఉండవలసినది. అయితే దానికి బదులుగా వారి ఉన్నతమైన ఆధిక్యతను దేవుని పనిని అడ్డగించుటకును, దేవుని ప్రజలకు విరోధముగా పనిచేయుటకును వాడుకొనిరి. దేవుని సేవకులకు విరోధులైరి. 'అందరును తమ స్వంత కార్యములనే చూచుకొనుచున్నారు' అని పౌలు ఫిలిప్పీ 2:21లో చెప్పెను. మద్రాసులో పని యింకను ప్రారంభించక పూర్వమే మేము ఎటువంటి ఎదిరింపులను ఎదుర్కొనవలెనో ప్రభువు మాకు ముందుగానే బయలుపరచెను. దాని విషయమే మమ్మును ఆయన హెచ్చరించెను. మేము 'జెహోవాషామా' కు వెళ్ళకముందు రాత్రంతయు ప్రార్థనలో గడపవలయునని మాకు భారము కలిగెను. మేము ఎదుర్కొననైయున్న పోరాటములను శ్రమలను ముందే ఎరిగియుంటిమి ప్రార్థనలో గడపవలెనని కోరితిమి. పట్టుదలతో ప్రార్థించితేనే తప్ప అటువంటి పోరాటములకు, ఎదిరింపులకు నిలువబడలేమని గుర్తించితిమి. కనుక దగ్గరగా ఉన్నటువంటి ఒక కొండమీదికి వెళ్ళి రాత్రంతయు ప్రార్థనలో గడపవలయునని తీర్మానించుకొంటిమి. పల్లవరము అనుచోటికి వెళ్ళితిమి. మేము దాదాపు ముప్పది మందిమి అక్కడకు వెళ్ళితిమి. అక్కడ చాలామంది సమాధులు ఉండెను. అంతేకాక ఆ స్థలమంతయు తేళ్ళతోను, జెర్రులతోను

నిండియుండెను. కొంతసేపు వాక్యము ధ్యానించుకొని ప్రార్థించుటకు ప్రారంభించితిమి. పెట్రొమాక్సు లైటు వెలుగుకు తేళ్ళు, జెర్రులు అన్నియు బైటకు వచ్చెను. అవి మమ్మును సమీపించినప్పుడు మేము వాటిని కనుగొని చంపుచుంటిమి. ఇది ఒక ప్రత్యేకమైన అనుభవము. ఎందుకనగా మేము ఒక వైపు ప్రార్థించుచుంటిమి. మరొకవైపు తేళ్ళను, జెర్రులను చంపుచుంటిమి. తెల్లవారిన తరువాత మద్రాసు పట్టణముపై సూర్యుడు ఉదయించుట మేము చూచితిమి. ఈ అనుభవము ద్వారా ప్రభువు మాతో స్పష్టముగా, తేటగా మాట్లాడెను. మేము భయంకరమైన ఎదిరింపులను ప్రజల ద్వారా ఎదుర్కొనవలయుననియు, ఆ ఎదిరింపులు తేళ్ళ కాట్లవలె, జెర్రుల కాట్లవలె బాధాకరమైనవిగాను ఉండునని ప్రభువు చెప్పెను. అంతేకాక వారిని గూర్చి భయపడనవసరములేదని కూడా ప్రభువు చెప్పెను. ఆ తేళ్ళు, జెర్రులు మాకేమి హాని చేయలేకపోయినట్లే, ఆ ప్రజలు ఎదిరింపులు కూడా మాకెట్టి కీడు నష్టము కలిగించలేవనియు. మేము వారిని జయించగలమనియు ప్రభువు మమ్ములను ధైర్యపరచెను. తేళ్ళు, జెర్రుల ద్వారా ప్రభువు మాతో మాట్లాడిన విషయములన్నియు సత్యమని తర్వాత మేము గ్రహించితిమి. కనుక మనము ప్రార్థించుట ఎంతో ముఖ్యమైనది. పట్టుదలతో కూడిన ప్రార్థన మనకెంతో సహాయపడును. అంతేకాక ప్రభువు మనలను ధైర్యపరచి, మనకు నడుపుదల నిచ్చును.

మన స్వంత జ్ఞానము ద్వారా శత్రువును జయించలేము. మన చమత్కారము, తెలివితేటలు, తలాంతులు, శక్తి సామర్థ్యముల ద్వారా శత్రువును ఎన్నటికిని జయించలేము. గడచిన 34 సంవత్సరములలో ప్రభువు తన వాగ్దానమును మా పక్షముగా నెరవేర్చెనని మేము సాక్ష్యమివ్వగలము. దేవుని పనిని అడ్డగించుటకు ప్రజలు ఎంతో విరోధముగా పనిచేసిరో అంత ఎక్కువగా ప్రభు మమ్ములను

ఆశీర్వదించెను. మొట్టమొదటిగా వారు మమ్మును ఎగతాళి చేసి, అపహసించిరి. మామీద వారు ఉపయోగించిన మొదటి ఆయుధ మదియే. దేవుని పనిని నిరోధించుటకు శత్రువు వాడుకొను బహుసామాన్యమైన ఆయుధము ఎగతాళియే. ఈ ఆయుధము నుపయోగించుటకు శత్రువు నాయకులనే వాడుకొనును. నాయకులు ఎగతాళి చేసి, అపహసించినట్లయినచో దేవుని పని బాగుగా ఆటంకపరచ బడగలదని వాడు భావించును.

సన్బల్లట్టు, టోబియా యెరూషలేములో ఉన్నత పదవులను కలిగియుండిరి; అంతేకాక వారు ధనవంతులు, పలుకుబడి గలవారు. వారి స్థానము, ఆస్థి ధనము, అధికారమును కాబట్టి మిగుల గర్వించి, దేవుని సేవించువారిని ఎగతాళి చేసిరి. అట్లు చేయుటలో వారికేమాత్రము భయము లేకుండెను. గడచిన సంవత్సరములలో యిటువంటి సంగతులు చాలా జరిగెను. స్కూళ్ళు, ఆస్పత్రులు, తదితర సంస్థలకు అధికారులుగా వుండి, ధనవంతులైనవారు - వారి పదవి, హోదా, డబ్బునుబట్టి అతిశయించి బాప్తిస్మములో సాక్ష్యమిచ్చిన వారిని ఎగతాళి చేయుచుండిరి. "మీరు చనిపోయినప్పుడు మిమ్మును ఎవరు సమాధి చేసెదరు? మీకు ఎవరు వివాహములు చేసెదరు? మీకు ఉద్యోగములు ఎవరిచ్చెదరు? మిమ్మును ఎవరు పోషించెదరు?" అని అపహసించెడి వారు. దేవునికి లోబడి, ఆయనను సేవింప వలయునని ఆశించిన ప్రతివారి మీదను శత్రువు ఈ ఆయుధమునే ప్రయోగించును. ప్రతి యుగములో యిది జరుగుచున్నది. అయితే బలమైనటువంటి ప్రార్థన అను ఆయుధము కొరకై ప్రభువుకు స్తోత్రములు. ప్రార్థన ద్వారా శత్రువును జయించగలము. మనము దేవునికి లోబడుటకు యిష్టపడినప్పుడు, అన్నిరకములైన శ్రమలను ఎదుర్కొనుటకు సిద్ధముగా నుండవలెను. శత్రువు నెహెమ్యాను అతని సహకారులను ఎదుర్కొనినప్పుడు వారు

ప్రార్థించి దేవుని సహాయమును పొందిరి. ప్రారంభములో మమ్మును హేళన చేసినవారు యిప్పుడు వారి యొద్దకు రమ్మనియు వారి కొరకు ప్రార్థించవలయుననియు, వారి మధ్యలో సువార్త దండయాత్రలు జరిగించవలయుననియు బ్రతిమాలుచున్నారు. వారి హేళనలు, ఎగతాళి మాటలు, మౌనముగా, ఓపికతో భరించవలయును కొంతకాలమైన తర్వాత మనలను ఎవరు దూషించి హేళన చేసిరో, వారే మనద్వారా ఆశీర్వాదము పొందెదరు. పరలోక దర్శనమునకు నమ్మకముగా వుండి, వారి కొరకు ప్రార్థన చేయుటయే మనము చేయవలసిన పని.

ఏక మనస్సుతో, ఐక్యతతో పని చేయువలెనని వారు తలంచినట్లు ఆరవ వచనములో చదివెదము. దేవుడు సాగి పొమ్మని సెలవిచ్చిన రీతిగా వారు పనిలో ముందుకు సాగిరి. ఒక్కొక్కప్పుడు దేవుని పని నడ్డగించుటకు విశ్వాసుల మధ్యలో శత్రువు కలహమును, పోరాటమును, రేపును, మనమధ్యలో ఐక్యత కొరకై మనమెక్కువగా ప్రార్థించవలయును.

హేళనలు. అపహాస్యము ద్వారా పని ఆటంక పరచబడలేదని సన్బల్లట్టు, టోబియా ఎగిరినప్పుడు, వారు యింకను ఉగ్రులై వారి బలమును ప్రయోగించుటకు మొదలుపెట్టిరి. నెహెమ్యాకును అతని సహచరులకును విరోధముగా పనిచేయుటకు కుట్ర చేసిరి. భయపెట్టుట ద్వారా, వారి శక్తిని ప్రయోగించుట ద్వారా దేవుని పనిని ఆపగలమని వారు తలంచిరి. గడచిన సంవత్సరములో మేము కూడా యిట్టి అనుభవము ద్వారా వెళ్ళితిమి. అయితే శత్రువును ఓడించగలిగిన ఆయుధము ప్రార్థనయే (9వ వచనము). అందువలననే రాత్రంతయు ప్రార్థించ వలయునని భారముకూడా మాకు కలిగెను. ప్రార్థన ద్వారానే అనగా పట్టుదలతో వేదనతో చేయు ప్రార్థన ద్వారానే శత్రువు ఓడించబడును.

దేవుని ప్రజలకు దేవుని సేవకులకు విరోధముగా శత్రువు భయంకరమైన పోరాటమును రేపును. అట్టి సమయములలో వేదనలో పట్టుదలగా ప్రార్థించుట ద్వారానే శత్రు కార్యములను లయపరచెదము. (లూకా 23:31,32)లో ప్రభువు సీమోనూ పేతురు కొరకు ప్రార్థించినట్లు చూచెదము. "సీమోనూ, సీమోనూ, ఇదిగో సాతాను మిమ్మునుపట్టి గోధుమలవలె జల్లించుటకు మిమ్మును కోరుకొనెను గాని నీ నమ్మిక తప్పిపోకుండునట్లు నేనే నీ కొరకు వేడుకొంటిని. నీ మనస్సు తిరిగి తర్వాత నీ సహోదరులను స్థిరపరచమని చెప్పెను".

## 5. చెత్తను తొలగించుట

ప్రాకారములు పడిపోయినందునను, గుమ్మములు కాల్చబడి నందు వలనను అక్కడ చెత్త విస్తారముగా యుండెను. (నెహెమ్యా 4:16) బలమైన ప్రాకారమును కట్టవలయుననినచో మొదట చెత్తను తీసివేయవలయును. మానవ ఆచారములు, సాంప్రదాయములు, అభ్యాసములు అనునవియే చెత్తగా నున్నవి. దేవుని పని బలముగా జరుగవలయునని మనము ఆశించిన యెడల మొదట చెత్తనంతయు తీసివేయువలయును (మార్కు 7:1-13). చాలా స్థలములలో మతశాఖాధికారులు మానవ సంప్రదాయములను, ఆచారములను గట్టిగా పట్టుకొని యున్నట్లుగా మనము చూడగలము. వారిపితరుల పారంపర్యాచారములనే ఆచరించుచు దేవుని వాక్యమును నిర్లక్ష్యము చేయుచున్నారు.

ఒక దినము దేవుని భక్తి గలిగి గౌరవనీయులుగా కనిపించు పదిమంది మతశాఖాధికారులు నా యొద్దకు వచ్చిరి "మీ కూటముల ద్వారా దేవుడు చేయుచున్న కార్యములంతటి కొరకై మేము సంతోషించుచున్నాము" అని ఎంతో మర్యాదగా చెప్పిరి. తర్వాత నేను చేయు రెండు విషయములు వారికి సమ్మతముగా లేవనియు నేనేల

వాటిని చేయుచున్నానని నన్ను ప్రశ్నించిరి అందులో మొదటిగా 'నీవు ఎందుకు బాప్తిస్మమిచ్చు చున్నావు?" అని అడిగిరి. రెండవదిగా "ఆదివారము నాడు ప్రత్యేకముగా ఆరాధన ఎందుకు నడిపించు చున్నావు?" అని ప్రశ్నించిరి. అందుకు నేను "చిన్న పిల్లలు బాప్తిస్మము పొందినట్లు బైబిలులో ఎక్కడైనను యున్నదేమో నాకు చూపించుడి. మరియు బాప్తిస్మమనగా అర్థమేమో నాకు తెలియచేయుడి" అని అంటిని. అందుకు ఒక ముఖ్యమైన పాస్టరు "ఎన్నో యుగముల నుండి భక్తి పరులు చిన్నబిడ్డలకు బాప్తిస్మము యిచ్చుచున్నారు. వారు చేసినదంతయు తప్పేనా?" అని నన్ను అడిగెను. అందుకు నేను మాతాత కూడా చాలా భక్తిపరుడు, సత్పురుషుడు కూడ. నేను మా తాత మాటలు వినవలయునా? లేక బైబిలు చెప్పుదానిని విలవలయునా? అని అడిగితిని. "నీ ప్రశ్నలకు జవాబు చెప్పుటకు మేము సిద్ధపడి రాలేదు" అనిరి. అప్పుడు నేను, మీరే ఒక దినము నిర్ణయించి సమయము, స్థలము కూడా మీరే నిర్ణయించండి. మీరు ఎంతమంది పాస్టర్లనైనను ఆహ్వానించుకొని నన్ను పిలిపించిన యెడల నేనుఒక్కడనే మీ యొద్దకు వచ్చెదను. కాని ఒక విషయము మాత్రము గమనించుడి. మీరందరు ఏమి చెప్పినను, బైబిలు నాధారము చేసికొని మాట్లాడవలెను. మాట్లాడే విషయములు బైబిలులో ఉన్నవని మీరు వాక్యమును ఎత్తి చూపించవలయును" అంటిని. వారు దానికి సమ్మతించి, దానికొరకై తారీఖు, సమయము, స్థలము నిర్ణయించి తప్పనిసరిగా వచ్చెద మనిరి అయితే ఈ దినము వరకు వారు రాలేదు.

ఆదివారమున జరుగు ఆరాధనను గూర్చి వారితో యిట్లు చెప్పితిని. "మేము ఎవ్వరిని సభ్యులుగా చేయము. చందాలు కూడా వసూలు చేయము. అక్కడ యిక్కడ వెళ్ళి, ఆదివారము నాకు ఆరాధనకు రండి అని ప్రజలను ఆహ్వానించము. ప్రజలను ఆకర్షించుటకు మేము

పాలపొడి కాని మరి ఏదైనను మేము ఇవ్వము. అయితే ప్రజలు తామంతట తామే ప్రభువును అరాధించుటకు వచ్చినప్పుడు వారిని రావద్దని మాత్రము చెప్పజాలము. అంతమాత్రమే కాదు. దేవుని ఆరాధించుటకు మాకు హక్కు గలదు. ఆయన మా పాపములు క్షమించి మమ్మును తన ప్రశస్త రక్తముతో శుద్ధీకరించియున్నాడని బైబిలులో స్పష్టముగా చెప్పబడినది. ఆయన బైబిలులో మాకు చూపించినరీతిగా తప్పక దేవుని మేము ఆరాధించెదము" అని వారితో చెప్పితిని. కూటములలో ఎన్నడైనను బైబిలుకు విభేధముగా మాట్లాడితినా?" అని వారి నడిగితిని.

అదివారమున మా ఆరాధన కూడిక చాలాసేపు పట్టును. ఒక ఆదివారము ఒక పాష్టరు మధ్యాహ్నము ఒంటిగంటకు ఆరాధన కూడికకు వచ్చెను. ఆరాధన చాలాసేపు జరుగును. కనుక ఆతడు మధ్యలో లేచి బయటకు వెళ్ళి తిరిగివచ్చి మీటింగులో కూర్చుండెను. కూడిక ముగిసిన తర్వాత అతడు నాతో " నేను ఎన్నో ప్రశ్నలతో యిక్కడికి వచ్చితిని. అయితే ఆరాధన సమయములలో దేవుడు నా ప్రశ్నలన్నింటికి జవాబు యిచ్చెను అని చెప్పెను" వారి స్వగ్రామమునకు సువార్త దండయాత్రకు రమ్మని కూడ అతడు మమ్మును అహ్వానించెను. దానికి కావలసిన ఏర్పాటులన్నియు తానే చేసెదననియు కూడా చెప్పెను.

విశ్వాసుల మనస్సులలో నుండియు, తలలలో నుండియు, తొలగింపవలసిన మరియొక రకమైన చెత్త కలదు. వివాహ సందర్భములలో ఈ చెత్త బయటపడును. ఈ చెత్తవలన దేవుని పని వర్ధిల్లుటలేదు. విశ్వాసులమని చెప్పుకొనువారు వ్యర్థమైన వాటి యందు అతిశయించుచు ఆత్మీయముగా అంధులగుచున్నారు. కొందరైతే సంఘములో అగ్రస్థానములు కావలయునని కోరుచున్నారు. ప్రభువే మనలో కొందరిని ఉపదేశకులుగాను, మరి కొందరిని సువార్తికులుగాను.

మరి కొందరిని బోధకులుగాను, యుండుటకు పిలుచుచున్నాడు. అయన పిలిచినప్పుడు ఆ పనికై అయనే వారిని సిద్ధపరచి, ఆ పనిలో వారిని నియమించును సంఘములో స్థానము కావలయునని కోరువారు సంఘములో కలహములు, పార్టీలు, విభజనలు అను చెత్తను రాజేయుదురు. వారిట్లు చేయుట కొన్ని సంఘములలో చూడగలము. దేవుని వాక్యానుసారముగా ఈ చెత్త తొలగింపబడితేనే తప్ప, దేవుని పని స్థిరపరచబడదు. ఈ చెత్త తొలగింపబడి నప్పుడే అయన పరలోకపు ఏర్పాటు నెరవేర్చబడును.

"పని మిక్కిలి గొప్పది. మనము గోడ మీద ఒకరొకరికి చాలా యెడముగా ఉన్నాము" (నెహెమ్యా 4:19). దేవుని పని విస్తరించి నప్పుడు మనకు ఇష్టమైనప్పుడెల్లను కలిసికొనుటకు లేక సహవాసము చేయుటకు వీలుపడదు. కనుకయే సమాజము బలహీనమగును. ఈ బలహీనత వలన యితరుల పట్ల నిర్లక్ష్య స్వభావము ఈ రీతిగా అలక్ష్యము అను చెత్త సంఘములో చేరును. ఈ కష్టము తొలగించుటకు మనము అధికముగా ప్రయాసపడి సహవాసమునకై కూడి రావలెను. పరిశుద్ధ సమాజ కూడికలు పరిస్థితుల ద్వారా కలిగిన ఎడబాపు తొలగింప బడుటకును, తిరిగి సహవాసము కలిగి యుండుటకు తోడ్పడుచున్నవి.

## 3వ అధ్యాయము

## దేవుడు పనిని వర్ధిల్లచేయును

### I. లేమిలో కలిమి

ఇశ్రాయేలు ప్రజలు యెరూషలేము గోడలను తిరిగి నిర్మించుటకు ప్రారంభించినప్పుడు శత్రువుల ద్వారా ఎదిరింపబడిరను

విషయమును యింతకుముందే చూచితిమి. యిప్పుడు దేవుని పనిని ఆటంకపరచు సమస్యలను వారు ఎట్లు ఎదుర్కొనవలసి వచ్చెనో, వారు ఎట్లు దేవునికి సంపూర్ణులుగా విధేయులైరో యిప్పుడు చూచెదము. వారి మధ్యలో ప్రేమ లేనందువలన వారు అనేక సమస్యలను ఎదుర్కొవలసి వచ్చెను. ఆ సమయములో ఆదేశములో కరువు వుండెను. వారి దారిద్ర్యమును బట్టి, వారి ద్రాక్ష తోటలను, భూములను ఇండ్లను కుదువబెట్టిరి. (నెహమ్యా 5:34). కొందరు యూదులు వడ్డీకూడ తీసుకొనుచుండిరి. అక్కరలో యున్నవారిని ఆదుకొనుట విశ్వాసములుగా మన కర్తవ్యము. మన భాద్యతను నిర్వహించుటలో మనము తప్పిపోయినట్లయినచో మనము దేవుని పనిని ఆటంకపరచెడివారముగా యుందుము. దేవుని బిడ్డలముగా ఆహారము, డబ్బు అవసరతల కొరకై యితరులను అడుగజాలము (కీర్తనలు 34:10:37:15). దేవుని యందు విశ్వాసముంచలేక ధన సహాయము కొరకై యితరుల నర్థించువారు జీవిత కాలమంతయు భిక్షకులుగానే యుందురు. అవసరతలలో యున్నవారు వారి అక్కరల కొరకు ఎట్లు ప్రార్థించవలయునో నేర్చుకొన వలయును. సమృద్ధి గలవారు అక్కరలో యున్నవారికి సహాయపడుటకై ప్రార్థించి, వారి అవసరతలేవో తెలిసికొని, వారికి సహాయపడవలెను. దేవుని నడుపుదల ప్రకారము యితరులకు సహాయం చేసినట్లయినచో అనేకుల అవసరతలు తీర్చబడును. అంతేకాక మనకు కూడా ఏ నష్టము కలుగదు.

కొన్ని సంవత్సరముల క్రితము మంచి విశ్వాసులైనటువంటి ఒక పేద కుటుంబముతో నేను కలిసి యుంటిని. ఆ దినములలో ఆ యింటి యజమానుడు తన ఉద్యోగమును కోల్పోయి యుండెను. ఒకరోజు వారి యింటిలో పూటకు ఆహారమేమియు లేకుండెను. అయితే ఆ యింటిలోని వారందరును, చిన్న పిల్లలతో సహా ఏ

మాత్రమును సణగక ప్రార్థించిరి. దేవుడు అక్కరను తీర్చగలడు కనుక ఎవరిని అడుగనవసరము లేదనిరి. మేము ప్రార్థించుచుండగా, తలుపు దగ్గర ఏదో శబ్దము వినిపించెను. ఎవరైనను తలుపుదగ్గర రాయి పడవేసిరేమో అని తలంచి తలుపు తెరువగా, అక్కడ ఒక గోనెసంచి పడవేయబడి యుండెను. కుటుంబమంతటికి కావలసిన రొట్టె, కూరగాయలు, యింకా తదితర భోజన పదార్థములు ఆ సంచిలో యుండెను. మన అక్కరల కొరకై ఇతరులను అడుగుకొనుటకు ప్రారంభించినచో దేవుడు ఏ మాత్రము సంతోషించడు. అంతేకాక మనము భిక్షకులముగానే యుందుము.

నా క్రైస్తవ జీవితారంభ దినములలోనే, నా అక్కరలు నేను ఎవరికిని తెలియచేయకూడదని ప్రభువు నాతో చెప్పెను. మాట ద్వారాగాని సూచన ద్వారా గాని మరే విధానములోనైనను నా అక్కరలు ఎవ్వరితోను చెప్పకూడదని ప్రభువు చెప్పెను. నా అవసరతలన్నియు అయనకే ప్రార్థనలో చెప్పెదను. కొన్ని దినములు నాకు ఆహారమే లేకుండెను. అయినను ఎంతో దూరము నడువలసి వచ్చెడిది. ఒక దినము నాకు చాలా ఆకలివేసెను. అప్పుడు నేను ఇట్లు తలంచితిని. "నాకు చాలా ఆకలి వేయుచున్నది. ఆహారము నాకు పెట్టుడి అని ఎవరిని నేను అడుగలేను. నేను నా స్నేహితుని యింటికి వెళ్ళినట్లయిన, అతడు తప్పక భోజనం చేయుమని నన్ను అడుగును. నేను 'వద్దు' అని చెప్పెదను. రెండవసారి అడిగినప్పుడు కూడ నేను వద్దనే చెప్పెదను. మూడవసారి భోంచేయుమని నన్ను అడిగినట్లయిన నేనే భోంచేసెదను' అని తలచుచు నా స్నేహితుని యింటికి వెళ్ళితిని. అక్కడకు వెళ్లినప్పుడు నేను తలంచిన రీతిగానే జరిగెను. కనుక నేను నా స్నేహితుని యింటిలో భోంచేసితిని. కొన్ని వారములు గడచిన పిమ్మట నాకు మరల అదే శోధన కలిగెను. నాకు చాలా ఆకలి వేసెను. కనుక తిరిగి నా స్నేహితుని

యింటికి వెళ్ళవలయుననుకొంటిని గడచిన అనుభవంను జ్ఞాపకం చేసికొనుచు నడుచుచుంటిని. మధ్యాహ్నం 1.30 గం॥ ప్రాంతంలో ప్రభువు నన్ను గద్దించెను. "నీ విశ్వాసమెక్కడ?" అని ప్రభువు నన్ను ప్రశ్నించెను. అందుకు నేను, "ప్రభువా, నాకు ఆహారం పెట్టుమని నా స్నేహితుని నేను అడుగను. అతడు నన్ను బలవంతము చేసినప్పుడే నేను భుజించెదను" అంటిని. అందుకు ప్రభువు "అక్కడకు వెళ్ళుటలో నీ ఉద్దేశమేమి?" అని ప్రశ్నించెను. అప్పుడు నేను సిగ్గుపడితిని. వెంటనే నేను ప్రభువా, నన్ను క్షమించుము. నా ప్రతి అక్కరకు నీవు చాలినవాడవు అని చెప్పితిని. (కీర్త. 23:1). ఈ రీతిగా ప్రభువు నాకు బలమైన విశ్వాసము నిచ్చెను. మరియొకసారి ఒక దినమంతయు నాకు ఆహారం లేకుండెను. మద్య రాత్రిలో ఒకరు నా తలపు తట్టగా నేనే మేల్కొంటిని. అప్పుడతడు "సహోదరుడా, ఈ రాత్రివేళలో వచ్చినందులకు క్షమించుము. నేను నిద్ర పోవుచుండగా నాకు ఒక కల వచ్చెను. ఆ కలలో ఎవరో ఒక వ్యక్తి మిమ్ములను భోజనంకు పిలువుమని నాతో చెప్పెను. నేను లేచి వంటగదికి వెళ్లిచూడగా అక్కడ గిన్నెడు అన్నం మిగిలిపోయి ఉండెను. మీరు ఈ దినము భోజనం చేసితిరా?" అని నన్ను అడిగెను. నేను అబద్ధం చెప్పలేను కనుక ఆ దినమంతయు నేను భోజనం చేయలేదని చెప్పితిని. ఆ మద్యరాత్రి వేళలో అతడు నన్ను తన యింటికి పిలుచుకొని పోయి నాకు ఆహారం పెట్టెను. ఈ సంఘటనలు ఆకస్మాత్తుగా జరిగినవి కావు.

మరొకసారి మేము 25 మందిని సువార్త దండయాత్రకు వెళ్ళితిమి. ఆ దినములలో మా వంట మేమే చేసికొనెడివారం. ఆదివారం నాడు వంట విషయమై బాధ్యులైన వారు వంట చేయు నిమిత్తం అక్కడనే ఉండదలచిరి. అప్పుడే నేను " ఆరోజు మనమందరమూ ఆరాధనకు వెళ్ళవలయునని ప్రభువు కోరుచున్నాడు" అని చెప్పితిని.

అందుకు వారు "అలాగైతే, మధ్యాహ్నకాలపు భోజన విషయమేమి?" అనిరి. "ప్రభువే చూచుకొనును" అని నేను జవాబు చెప్పితిని. గనుక మేమందరంను ఆరాధనకు వెళ్ళితిమి. ఆరాధన కూడిక తరువాత మేమందరం బస్సుస్టాఫ్ దగ్గర నిల్చుని యుంటిమి. నాకు తెలిసిన ఒకతను, ఒక పెద్దబుట్టతో మావైపు వచ్చెను. "మీరు ఎక్కడకు వెళ్ళుచున్నారు? అని నేనతనిని అడిగితిని. అందుకతడు నేను ఒక పెండ్లి విందుకు వెళ్ళియుంటిని. విందు ముగిసిన తర్వాత భోజనం చాలా మిగిలిపోయెను. పెండ్లివారు ఎవరైనను భోజనం తీసుకొని వెళ్ళవచ్చునని చెప్పిరి. నాకు కుటుంబం లేదు కనుక నా పొరుగువారికి, స్నేహితులకు ఆహారం తీసుకొని వెళ్ళుదుమని తలంచితిని. యిక్కడ మిమ్ములను చూడగానే ఈ ఆహారం మీకివ్వవలయునని తలంపు కలిగెను" అని చెప్పి, ఆ ఆహారంను మాకిచ్చి వెళ్ళెను. అతడు తెచ్చిన ఆహారం మా కందరికి సరిపోయెను. మా కొరకై శ్రేష్ఠమైన ఆహారంను. ప్రభువు సిద్ధ పరచి యుండెను. మనం ప్రభువు నందు నమ్మిక యుంచినంత కాలము ప్రభువు మన అక్కరలు తీర్చును. ఒకరోజు పెందలకడనే నేను ప్రార్థించుచున్నప్పుడు, ఒక విధవరాలికి 5 రూపాయలు ఇచ్చి రమ్మని ప్రభువు నాతో చెప్పెను. నా జేబులో డబ్బులేమియు లేకుండెను. అయినను ప్రభువు, 'నీవు వెళ్ళి 5 రూ॥లు ఇచ్చిరమ్ము' అని నాతో చెప్పెను. నేను నా కోటు వేసుకొని, బైబిలు తీసుకొని బయలుదేరితిని. నేను వెళ్లుచుండగా 5 రూ॥లు నోటు నాకు దారిలో కనిపించెను. దానిని చేతిలో పట్టుకొని, "ఎవరైనను 5 రూ॥లు నోటు పోగొట్టుకొంటిరా?" అని బిగ్గరగా అరచితిని. మూడుసార్లు ఆ రీతిగా అడిగితిని. ఎవరు కూడ, "ఈ డబ్బునాదే" అని చెప్పనందు వలన దానిని తీసుకొని ఆ విధవరాలి ఇంటికి వెళ్లి, ఆమెకు దానిని ఇచ్చితిని. దానిని చూచి ఆమె ఏడ్వనారంభించెను. అంతకు ముందురాత్రి ఆమె

కలలో తన భర్తను చూచెననియు, భక్తసింగ్ గారు వచ్చి నీకు 5 రూ॥లు ఇచ్చును గనుక నీవు దిగులు పడవద్దని అయన ఆమెతో చెప్పెననియు నాతో చెప్పెను. అంతేకాక నన్నుగూర్చి తలంచుచున్న సమయంలోనే నేను వచ్చితినని కూడా చెప్పెను. ఇవన్నియు అనుకొనని రీతిగా అకస్మాత్తుగా జరిగిన విషయములు కావు.

ప్రభువు మనకు సహాయం చేయుకొలది, అయన నడిపింపు ననుసరించి అక్కరలోనున్నవారిని మనము ఆదుకొనవలెను. భోజనము, దుస్తులు, డబ్బు లేనటువంటి వారికి మనం వారి అక్కర ప్రకారం సహాయం చేయవలెను. ఈ రీతిగా మన మధ్యలోనున్న పేద విశ్వాసులకు, విధవరాండ్రకు, అనాధలకు మనము సహాయం చేయుట ద్వారా వారిని ధైర్యపరచెదము. చాలమంది విశ్వాసులకు సమృద్ధిగా యున్నది. వారికి కావలసిన దాని కంటె అధికముగా కలిగియున్నారు. అయినను యితరులకు సహాయము చేయవలయుననెడి తలంపు వారికి లేదు. యిట్టి స్వార్థముండుట ద్వారానే వారి హృదయములు ఎల్లప్పుడు ద్వేషము అసూయ, సణుగులతో నిండియుండును. అపొస్తలుల కార్యములు 6:5, 6లో అది అపొస్తలులు విశ్వాసముతోను, పరిశుద్ధాత్మతోను నిండిన వారిని ఏర్పరచుకొనిరి. ఈ దినములలో అనేకులు పదవులను అపేక్షించుచున్నారు. డీకనులుగా, పెద్దలుగా వుండవలెనని కోరుచున్నారు కాని పేద విశ్వాసుల కొరకై ప్రేమ, జాలి లేదు. వారి విషయమై ఎటువంటి శ్రద్ధ వారికి లేదు. వారికి కావలసినదంతయు ప్రాధాన్యతయే. ఎవరైతే ఆత్మీయులుగా వుండి దేవుని ద్వారా సిద్ధపరచబడెదరో వారు మాత్రమే కాపరులయ్యెదరు. యూదయలో కరువుండినప్పుడు. అంతియొకయలోని విశ్వాసులు తమ శక్తి కొలది వారికి సహాయం చేసిరి. వాటిని బర్నబా, పౌలు అను

వారిచేత వారియొద్దకు పంపిరి. ఈ విషయమును అపొ. కార్య, 11:29, 30 వచనములలో చూచెదము.

పౌలు, బర్నబాలు యెరూషలేము చేరునప్పటికి అక్కడి విశ్వాసులు ప్రార్థించుచుండిరి. ఆ సమయములో అక్కడ కరువు బహుభారముగా వుండెను. అంతేకాక విశ్వాసులు భయంకరమైన శ్రమను ఎదుర్కొనుచుండిరి. వారి కష్టములను గూర్చి చింతించి కలవరపడుటకు బదులుగా వారు విశ్వాసముతో ప్రార్థించుచుండిరి. వారిని చూచి పౌలు, బర్నబాలు ఆశ్చర్యపడిరి. (అపొ. కార్య, 12:5) వారు అక్కరలో వున్నారని వారి సహాయార్థం కొంత డబ్బును, కొన్ని పదార్థములను వారికిచ్చుటకు పౌలు, బర్నబా వెళ్లిరి. అయితే వారు తిరిగి వచ్చుచున్నప్పుడు నూతన ప్రార్థన భారముతో వచ్చిరి. ఆ రీతిగా యెరూషలేము నుండి అంతియొకైయకు గొప్ప ఆశీర్వాదమును తీసికొని వచ్చిరి. యితరులకు పంచుకొనుట ద్వారా పరలోక దర్శనమును పొందెదము. విశ్వాసులముగా అక్కరలోనున్న వారికొరకు ప్రత్యేకముగా ప్రార్థించవలయును. కాపరులు, పెద్దలు కూడా ఈ ఆత్మీయ రహస్యమును ఎరుగవలెను.

నెహెమ్యా 12 సంవత్సరములు అధికారిగా ఉండినప్పటికిని, అతడు జనుల వద్దనుండి డబ్బు తీసికొనలేదు. ఏ వస్తువు కూడా తీసికొనలేదు. ఆయన అధికారియైనను డబ్బు కాని, ఆహారము కాని ప్రజల వద్ద నుండి పుచ్చుకొనలేదు. తనకు ముందుగా నుండిన అధికారులు వారికి కావలసిన ఆహారము, ద్రాక్షారసము కొరకు ప్రజల మీద ఆధారపడిరి. వారైతే డబ్బు కొరకు పని చేసిరి. కాని నెహెమ్యా దేవుని భయం కలిగినవాడై పనిచేసెను. (నెహెమ్యా 5:14,15)

దేవుని సేవకులు కూడా సుఖ సౌఖ్యముల ద్వారా నడిపించ బడుచున్నారు. ధనాపేక్ష, స్వలాభాపేక్ష వారిలో కూడా వుండుట మేము

చూడగలుగుచున్నాము. ఎవరు డబ్బు యిచ్చెదరో, వారి గృహములనే దర్శించెదరు. వారి సంఘములలోని ప్రజలను వారి అక్కరలో సహాయము చేయక పోయినట్లయినచో తమ ఆస్తితో దేవునిని ఘనపరచలేక పోవుచున్నారని ప్రసంగములలో వారిని గద్దించెదరు. వారు తమ అక్కరల కొరకై దేవునిని నమ్ముకొనలేకున్నారు. తత్ఫలితముగా వారి జీవితములు నిష్ఫలితమై వున్నవి. మనము దేవుని నమ్మకముగా సేవించి, మన అక్కరలన్నింటి కొరకై ఆయన మీదనే ఆధారపడి, ఏ మాత్రం ప్రభువును సందేహించక హృదయంలో సణుగుకొనక వుండినప్పుడే మన పరిచర్య సమృద్ధిగా ఫలించును. చాల మంది సేవకులు విశ్వాసముతో జీవించుచున్నామని చెప్పెదరు. వాస్తవంగా వారు ఇతరుల విశ్వాసముమీద ఆధారపడెదరు. కనుక దేవుని సేవకులైన వారు హెచ్చరికగా తీసుకొనండి. ఆహారము, డబ్బు, సౌఖ్యము కొరకై దేవుని సేవించవద్దు. ఏమి చేసినను ప్రభువు కొరకే చేయవలెను. మనము ఆయన మీద ఆధారపడుటకు నేర్చుకొనినప్పుడు ప్రభువు తనంతట తానే మన అక్కరలన్నియు తీర్చును. మన అక్కరలు తీర్చుటలో ఆయన ఎప్పటికిని తప్పిపోడు. ఎంతో అద్భుతమైన రీతిగా ఆయన తన సొంత విధానములో మన అక్కరలు తీర్చును. అయితే ఆయన మన విశ్వాసమును బలపరచవలయునని కోరును. దేవుని సేవకులే విశ్వాసముతో జీవించలేక పోయినట్లయినచో వారు ఇతర విశ్వాసులకు మాదిరిగా యుండలేరు. దేవుని సేవకులు బిక్షకులుగా యున్నప్పుడు దేవుని పని తీవ్రముగా నష్టపడును. వారు విశ్వాసముతో జీవించలేక పోయినట్లయినచో దేవుని సేవ నుండి విరమించుకొనుటయే మంచిది. ఎందుకనగా వారు దేవుని పనిలో తోడ్పడుటకు బదులుగా, దేవుని పనికి నష్టము కలిగించెదరు. అట్టివారు దేవుని సేవకులుగా యుండుటకు అనర్హులు. వారు దేవుని నామమునకు నింద తీసుకొని వచ్చెదరు.

మన దేవుడు ప్రేమగలవాడు, నమ్మదగినవాడు. మన పరిచర్య, మన జీవితము ద్వారా ఆయనను సంతోషపరచి, తృప్తి పరచవలెను.

## 2. పరీక్షలలో విజయము

నెహెమ్యా యెరూషలేము గోడలు కట్టుట ముగించెనని సన్బల్లట్టు టోబియా, గెషెము వినినప్పుడు వారు నెహెమ్యాకే కీడు చేయుటకు తలపెట్టిరి. శత్రువు దేవుని పనిని ఆటంకపరచలేనప్పుడు, దేవుని పని వర్థిల్లుచున్నప్పుడు, వాడు దేవుని సేవకులపై తన ఆయుధమును ప్రయోగించును. దేవుని సేవకులను కష్టములలో ఇరికించుటకు వాడు ప్రయత్నించును. దేవుని సేవించుచున్న సమయమంతటిలో తరచుగా మేము ఈ యుద్ధములను ఎదుర్కొనవలసి వచ్చెడిది. దేవుని సేవలో యుండువారు యిటువంటి పోరాటములను ఎదుర్కొనక తప్పదు.

నెహెమ్యా తన పని చేయకుండ దాని నుండి ఆయనను మళ్లించుటకు వారు ప్రయత్నించినట్లు నెహెమ్యా 6:2,3లో చూచెదము. అదేరీతిగా మనము దేవుని పనిలో నిమగ్నులమైనప్పుడు, లోకస్తులు ఆ పని నుండి మనలను తప్పించుటకై లోక సంబంధమైన విందులకు, వినోదములకు మనలను ఆహ్వానించెదరు. ఆయన పని నుండి మన గమనము తొలగించుటకును, మన బాధ్యతలో మనము తప్పిపోవునట్లు చేయుటకు వారు ఆ రీతిగా ఆహ్వానించెదరు. ఆ సమయములో మనము ఉన్నతమైన పదవుల నిచ్చెదమని చెప్పెదరు. కేవలము స్వాతిశయ పూర్ణులుగా చేయుటకై వారు అట్లు చేసెద[illegible] కొన్ని పర్యాయములు నూతనముగా జన్మించిన వారు దేవుని విషయములలో ఆసక్తి కనుపరచినప్పుడు, తమ శాఖల నాయకులు అట్టివారికి అధ్యక్ష పదవి నిచ్చెదమని లేక సంఘములో పెద్దగా చేసెదమని లేక బాధ్యతతో

కూడిన పని యిచ్చెదమని ఆహ్వానించెదరు. క్రొత్తగా జన్మించిన వ్యక్తిని సంఘములో పెద్దగా నిర్ణయించుట వాక్యమునకు విరోధము. 1 తిమోతి 3:1-10, తీతుకు 1:6-9 చూచినట్లయినచో ఒక వ్యక్తి పరీక్షింపబడిన పిమ్మటే అతడు పెద్దగా నుండవలయునను విషయము విశాదముగా తెలియుచున్నది. క్రొత్తగా జన్మించినవారు క్రీస్తుయేసు కృపలో, జ్ఞానములో ఎదుగకుండునట్లు శత్రువు వేరొకరీతిగా వారిని మోసగించును. క్రొత్తగా జన్మించినవారు దేవుని వాక్యమును ప్రేమించి, ఆత్మీయముగా ఎదుగవలెనని కోరునప్పుడు పాస్టర్లు సంఘములో ప్రసంగించుటకై వారిని అహ్వానించెదరు. వారిని చూచి యితరులు కూడ పలుకుబడి ఘనతను కోరెదరు. ఈ రీతిగా విశ్వాసులైన అనేకులు ఉన్నత పదవులు, అధికృతలను కోరినవారై మోసగింపబడి, తప్పుగా నడిపించబడుచున్నారు. ఎవరైతే పదవిని ఆశించెదరో, వారే సంఘములో కష్టములను కలిగించెదరు. వారి కుటుంబములు మాదిరికరంగా యుండవు వారి బిడ్డలు తిరుగుబాటు చేసెదరు. వారికి ప్రార్థన భారమే యుండదు. అయినను పెద్దలుగా యుండవలయునని అధికారం, పదవిని కోరెదరు. వారికి ఆ స్థానమివ్వనట్లయినచో అబద్ధ ప్రచారంలు చేయుచు, సంఘంలో కష్టములు కలిగించెదరు.

సన్బల్లటు, టోబీయా అనువారు నెహెమ్యాకు తొందర కలిగించుటకే ప్రయత్నించుచుండిరి. ఆయనను కష్టములలో యిరికించవలయునని పట్టుబట్టిరి. ప్రయత్నములన్నియు విఫలమైనప్పుడే నెహెమ్యా మీద అబద్ధ నేరములు మోపుచు ఒక ఉత్తరం వ్రాసిరి. ఈ దినములలో కూడి దేవుని సేవకుల మీద అసభ్యమైన సంగతులు కొంతమంది వ్రాయుచున్నారు. ఏ ఆధారం లేని విషయంలను కల్పించి, అసహ్యంగా దేవుని సేవకులను గూర్చి ఉత్తరంలు వ్రాసెదరు. అయితే దేవుని సేవకులను గూర్చి ఉత్తరంలు వ్రాసెదరు. అయితే దేవుని

సేవకులంగా మనం ప్రార్థించి ఆ విషయమును దేవుని చేతులకు అప్పగించవలెను. దేవుడు ఎన్నటికిని తప్పిపోడు. మన బలమైన ఆయుధం ప్రార్థనయే.

## ప్రార్థన బలమైన ఆయుధము

దేవుని సేవకుడయిన నెహెమ్యా మీద అబద్ధ నేరంలు మోపినప్పుడు అతని హృదయంలో భయం కలిగెను. అయితే అతడు వెంటనే ప్రార్థించి, "దేవా, ఇప్పుడు నా చేతులను బలపరచుము" అనెను. శత్రువు బలంగా మమ్మును ఎదుర్కొనినప్పుడు మేము ప్రార్థించగా వాని ప్రయత్నంలన్నియు వ్యర్థమయ్యెను. శత్రువు మనలను నిందించునప్పుడు, అబద్ధంగా మన మీద మాట లాడినప్పుడు, మనలను సమర్థించుకొనుటకై వాదించుట ద్వారా మన సమయంను వ్యర్థ పరచకూడదు. పట్టుదలతో చేయు ప్రార్థనయే శత్రువు యొక్క యుక్తిగల కుతంత్రములను, మనకు కీడు చేయుటకై వాడు చేయు ప్రయత్నములను విఫలము చేయును. శత్రువు మనలను ఎదిరించి నప్పుడు మనము పరిశుద్ధమైన స్థలములో చేరి ప్రార్థించినట్లయినచో వాడు పూర్తిగా ఓడిపోవును. ప్రార్థనలో మనముండినంత కాలము వాడు పూర్తిగా శక్తిహీనుడగును (నెహెమ్యా 6:8,9).

సన్బల్లటు టోబీయా చేసిన ప్రయత్నములన్నియు విఫలముగా వారు మరియొక విధానములో నెహెమ్యాకు శ్రమకలిగించుటకు ప్రయత్నించిరి. షెమయాకు డబ్బు యిచ్చి నెహమ్యాకు తప్పు సలహా యిచ్చి, తప్పుగా నడిపించుటకు ప్రయత్నించిరి. (10,12 వచనములు). నెహెమ్యా తన ప్రాణమును రక్షించుకొనుటకై, గర్భాలయములో దాగుకొనుమని షెమయా అతనికి సలహా యిచ్చినట్లు 10వ వచనములో చూచెదము. నెహెమ్యా ఆ సలహాను పాటించి యుండినట్లయినచో అతని మీద చెడు ప్రచారము చేయుటకు వారికి వీలు కలిగియుండెడిది.

ఈ దినములలో దేవుని ప్రజల మీద శత్రువు యిదే ఆయుధంను ఉపయోగించుచున్నాడు. ప్రభువు పనిలో మనలను ఆటంకపరచుటకై లోకస్థులైన మన స్నేహితుల, బంధువుల ద్వారా శత్రువు మనకు తప్పు సలహాలిప్పించును. ఆ రీతిగా అనేకులు దేవుని యందలి విశ్వాసమును కోల్పోయిరి. విశ్వాసులముగా మనము లోకస్థులైన బంధువులు, స్నేహితులు యిచ్చిన సలహాను పాటించకూడదు. దేవుని పరలోక చిత్తము ప్రార్థనలో సంపూర్ణముగా వెల్లడియైనప్పుడు, స్నేహితులు, బంధువుల యొక్క సలహాలను చెత్తబుట్టలో పడవేయవలయును. మత్తయి 12:45,50లో వ్రాయబడిన రీతిగా దేవుని చిత్తము చేయువారే ప్రభువు యొక్క సహోదరీలు, సహోదరులునై యున్నారు. దేవుని పనిలో లోకస్థుల సలహాలను అనుసరించకూడదు. దేవుని సేవకులైనవారు అనేకులు ఈ విషయంలో తప్పిపోయిరి. దేవుని పనికి డబ్బు అవసరమైనప్పుడు, అనగా ఒక స్థలంను కొనవలసినప్పుడు లేక మందిరం కట్టవలసి వచ్చినప్పుడు దేవుని నమ్ముకొనుటకు బదులుగా వారు వారి లోకజ్ఞానం అనుసరించి లోక స్నేహితుల యొక్క ఆర్థిక సహాయం కోరెదరు. డబ్బు అప్పు తెచ్చుకొనుటలో తప్పేమియు లేదని వారు తలంచెదరు. "దేవుని పనికేకదా డబ్బు తీసి కొనుచున్నాము. తిరిగి యిచ్చివేయదుము గనుక యిందులో తప్పేమియు లేదు" అని వారు భావించెదరు. డబ్బు కొరకై వారు ఉపయోగించు ఈ లోక పద్ధతులు వారి జీవితంలోనికి నిష్ఫల స్థితిని రానిచ్చెను.

షెమయా యిచ్చిన సలహా మంచిదికాదని నెహెమ్యా వివేచింపగల్గెను. అనేక పర్యాయములు దేవుని సేవకులు అని పిలువబడువారు విశ్వాసులతో అనవసరమైన భయంను పుట్టించెదరు. "దేవుడు ఫలానాదాని గూర్చి హెచ్చరించమని నాతో చెప్పెను" అని వారు చెప్పి అనేక హృదయములలో, గృహంలలో సందేహములు

భయములు కలిగించుచున్నారు. వారి సంతోషంను పాడుచేయుచున్నారు. మనం దేవుని వాక్యం నుండియే హెచ్చరిక తీసికొనవలయును గాని, అట్టివారి ద్వారా మనం మోసగింపబడకూడదు.

## ముగింపు

గోడలు కట్టుట పూర్తికాగానే అన్యజనులు, శత్రువులు కూడా ఆ పని దేవుని వలన జరిగినదని తెలిసికొనిరి (నెహె 6:15,16) మనం ప్రార్థనా పరులంగాయుండి, ప్రభువు మన కప్పగించిన పనిలో నమ్మకస్థులంగా వుండి శత్రువు ఎదిరించి నప్పటికిని మన పనిలో సాగిపోవుచుండినట్లయినచో నెహెమ్యాను వాడుకొనినట్లు, పాడైన జీవితంలను, చీలిపోయిన కుటుంబాలను సంఘంలను తిరిగి కట్టుటకు దేవుడు మనలను కూడా వాడుకొనును.

మన ద్వారా అటువంటి పని జరిగినప్పుడు మన శత్రువులు కూడ దేవుని ద్వారా ఆపని జరిగినదని దేవుని మహిమ పరచుటకై వెల్లడిచేసెదరు.

☆